సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 16 । జూన్ । 2023



ప్రాణాలు తీసిన అతివేగం

స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో విజయవాడ వెళ్తున్న ఇద్దరు స్నేహితులు మార్గమధ్యంలో ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యారు. - 8లో..



పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పేదల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టనాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
43/32

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

మంత్రి సురేష్‌ను కలిసిన డీటీసీ



మంత్రి సురేష్‌కు బొకే అందజేస్తున్న డీటీసీ సుశీల

యర్రగొండపాలెం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఒంగోలు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు ఉన్నారు.

పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల బదిలీలకు దరఖాస్తులు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 58 మండలాల్లో ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీలు, పరస్పర బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు జిల్లా కో ఆర్డినేటర్ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వివరాలను దరఖాస్తులో నమోదు చేసి సర్వీస్ సర్టిఫికెట్, స్పౌజ్ తదితర పత్రాలను ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునితో ధృవీకరణ చేయించి ఈ నెల 20వ తేదీ లోగా ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలన్నారు. ప్రస్తుతం ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎటువంటి ఖాళీలు లేవని, ఆర్ట్, వర్క్ కింద మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. జెడ్పీహెచ్ఎస్ ఉప్పుగుండూరు, ఎస్.నాగులవరం, బొద్దికూరపాడు, వేములకోటలో ఆర్ట్, కారుమూడివారిపాలెం, చెరువుకొమ్ముపాలెం, భీమవరంలో వర్క్ ఎడ్యుకేషన్ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

తెలుగుజాతి గుండెల్లో నిలిచి ఉండే మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ, నాగభైరవలకు నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: విప్లవ కవిత్వానికి పర్యాపదంగా నిలిచిన మహాకవి శ్రీశ్రీ, తనదైన శైలితో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించిన నాగభైరవ కోటేశ్వరరావు తెలుగు జాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. హౌసింగ్ బోర్డులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో గురువారం శ్రీశ్రీ, నాగభైరవల వర్ధంతి సభ జరిగింది. శ్రీశ్రీ గురించి మాట్లాడకుండా తెలుగు సాహిత్యం గురించి చర్చించలేమని, నాగభైరవను ప్రస్తావించకుండా తెలుగు కవిత్వం గురించి మాట్లాడలేమని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ చెప్పారు. తొలుత ఇరువురు కవుల చిత్రపటాలకు పూలమాలలేసి ఘనంగా నివాళి అర్పించారు. సాహితీవేత్తలు డాక్టర్ నూనె అంకమరావు, కుర్రా ప్రసాద్‌బాబు, ఓరుగంటి ప్రసాద్, యువి రత్నం, మిడసల మల్లికార్జునరావు, ఎస్.వెంకటేశ్వర్లు, సింహాద్రి జ్యోతిర్మయి, ఝాన్సీ దుర్గ, బీరం అరుణ, మారేపల్లి సూర్యకుమారి, నాళం నరసమ్మ పాల్గొన్నారు.

వార్డు సచివాలయ సిబ్బందికి బదిలీ ప్రక్రియ పూర్తి



బదిలీ ప్రొసీడింగ్స్ ఇస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయ సిబ్బందికి నిర్వహించిన బదిలీల ప్రక్రియ పూర్తయిందని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం బదిలీ అయిన వార్డు సచివాలయ సిబ్బందికి ప్రొసీడింగ్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు బదిలీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనల మేరకు బదిలీలు నిర్వహించామన్నారు. మొత్తం 27 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఆరుగురు బదిలీ ప్రక్రియకు హాజరు కాలేదన్నారు. 21 మంది బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు వారికి కేటాయించిన చోట జాయినింగ్ ప్రొసీడింగ్స్ అందజేశామన్నారు.



మర్రిచెట్లపాలెంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు

పారిశ్రామికానికి ఊపిరి

పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పరిశ్రమలు పూర్తిస్థాయిలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు ఊపిరినిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు ఇన్సెంటివ్‌లు(ప్రోత్సాహకాలు) ఇచ్చింది. తాజాగా వచ్చే నెలలో మూడో విడత జిల్లాలోని 742 యూనిట్లకు రూ. 121.45 కోట్లు రాయితీలు చెల్లించనుంది. ఈమేరకు రెండు రోజుల కిందట ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- పారిశ్రామిక రంగానికి ఆర్థికంగా దన్ను
- వరుసగా మూడోసారి ప్రోత్సాహకాలు చెల్లించేందుకు సిద్ధం
- జిల్లాలో 742 యూనిట్లకు రూ.121.45 కోట్ల రాయితీ
- వచ్చే నెలలో చెల్లించనున్న ప్రభుత్వం
- జీఓఆర్‌టీ నెం.2477 విడుదల
- పారిశ్రామికవేత్తల హర్షం

చీమకుర్తి:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పరిశ్రమలు పూర్తిస్థాయిలో నిలదొక్కుకునేందుకు క్రమం తప్పకుండా ఇన్సెంటివ్‌లు(ప్రోత్సాహకాలు) ఇస్తున్నారు. జిల్లాలో ప్రోత్సాహకాలను చెల్లించాల్సిన యూనిట్లు మొత్తం 742 ఉన్నాయి. వాటిలో ఎస్సీ కేటగిరీలో 139 యూనిట్లకు రూ.21.64 కోట్లు, ఎస్టీ కేటగిరీలో 19 యూనిట్లకు రూ.2.38 కోట్లు, జనరల్ కేటగిరీలో 582 యూనిట్లకు రూ.91.23 కోట్లు టెక్స్‌టైల్స్ విభాగంలో 2 యూనిట్లకు రూ.6.19 కోట్లు ఇలా మొత్తం మీద 742 యూనిట్లకు సుమారు రూ.121.45 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇంకా జిల్లాలో ప్రోత్సాహకాలు, పావలా వడ్డీ కోసం దరఖాస్తు చేసుకున్న పారిశ్రామికవేత్తలు మరో 2500 క్లైయిమ్‌లు ఉండొచ్చని జిల్లా పరిశ్రమల ఉన్నతాధికారులు వెల్లడించారు. వాటిని కూడా కలిపితే మరో రూ.3-5 కోట్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ముందుగా ప్రకటించిన క్యాలెండర్ షెడ్యూల్‌లో పరిశ్రమలకు రాయితీలను జూలైలో విడుదల చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా ప్రభుత్వం రెండు రోజుల క్రితం జీఓను కూడా విడుదల చేయడం పారిశ్రామికవేత్తల్లో సంతోషాన్ని నింపుతోంది.



మర్రిచెట్లపాలెంలో గ్రానైట్ బ్లాక్‌ను కట్‌చేస్తున్న దృశ్యం

రెండు విడతలుగా రూ.131.3 కోట్లు విడుదల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో 1855 క్లైయిమ్‌లకు రూ.82.5 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేశారు. 2021లో 395 యూనిట్లకు రూ.48.89 కోట్లు విడుదల చేశారు. గత రెండు విడతలలో కలిపి రూ.131.3 కోట్లను ఇప్పటికే పారిశ్రామికవేత్తలు తీసుకున్న రుణాలు బ్యాంక్ ఖాతాలలో జమ చేశారు. తాజాగా జూలైలో విడుదల చేయనున్న మూడో విడత రూ. 121.45 కోట్లు కలుపుకొని జిల్లాలో రూ. 252.75 కోట్లు పారిశ్రామికవేత్తలు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

పారిశ్రామిక వేత్తలకు భరోసా..

కరోనా కష్టకాలంలో పరిశ్రమలను నడపలేక బ్యాంకుల్లో తీసుకున్న రుణాల చెల్లింపులలో పరిశ్రమల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఇతర ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న యజమానులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా అందిస్తున్న ప్రోత్సాహకాలు వారిలో కొండంత భరోసానిచ్చింది. పరిశ్రమలను ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో ఆశలు రేకెత్తించింది. జిల్లాలో ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమను ఆధారంగా చేసుకొని పారిశ్రామికవేత్తలు గ్రానైట్ ఫ్యాక్టరీలు, భారీ ప్రొక్లెయిన్‌లు, వాటికి అనుబంధంగా టిప్పర్‌లు, కార్లు వంటి పలు రకాల వాహనాలకు సంబంధించిన పరిశ్రమలు ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమ ఎగుమతులకు గడ్డుకాలంలో నడుస్తుంది. ఫ్యాక్టరీల యజమానులు కరెంటు బిల్లులు చెల్లించలేక, బ్యాంక్ వాయిదాలను చెల్లించడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించనున్న ప్రోత్సాహకాలు గ్రానైట్ పారిశ్రామిక యజమానులను ఆదుకోనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీ దరఖాస్తులు పెరిగే అవకాశం



2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని పరిశ్రమలకు ప్రోత్సాహకాలను చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నెల 12వ తేదీన విడుదల చేసింది. జిల్లాలో ఇప్పటికి 742 యూనిట్లకు గాను రూ.121.45 కోట్లను రాయితీల రూపంలో చెల్లించాల్సి ఉంది. రాయితీల కోసం దరఖాస్తు చేసుకునే పరిశ్రమల యజమానుల సంఖ్య రానున్న రెండు మూడు వారాలలో ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వచ్చే నెలలో రాయితీలు విడుదల చేసే అవకాశం ఉన్నందున జిల్లాలోని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

– బి.శ్రీనివాసరావు, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఒంగోలు

పారదర్శకంగా బదిలీలు



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లాలో మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియను ఎస్పీ మలికాగర్గ్ పారదర్శకంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. దివ్యాంగులు, మ్యూచ్యువల్స్, స్పౌజ్, మానసిక వికలాంగులైన సంతానం కలిగిన వారికి, వైద్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న వారికి, ఒంటరి మహిళలు, వితంతు కేటగిరిల్లో వచ్చిన బదిలీ వినతులపై 44 మంది మహిళా పోలీసులతో ఎస్పీ మలికాగర్గ్ ముఖాముఖి మాట్లాడారు. వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ గురించి వివరించారు. సొంత ప్రాంతాల్లో కాకుండా ఇతరా సచివాలయల్లో ఉన్న ఖాళీలను ప్రత్యక్షంగా స్క్రీన్‌పై చూపించి అందులో వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. వెంటనే అక్కడికక్కడే ట్రాన్స్‌ఫర్ పత్రాలను అందజేశారు.

మెరుగైన సేవలు అందించాలి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మహిళల భద్రతలో కీలకపాత్ర పోషించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. అసాంఘిక కార్యాకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సేకరించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాలు, జాబ్ మోసాలు, పోక్సో చట్టంతో పాటుగా ఇతరా నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన టాస్క్‌లను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఓ ఎం సులోచన, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్‌కుమార్, సూపరింటెండెంట్ డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో గురువారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నాలుగేళ్ల కిందటి పరిస్థితులను జ్ఞాపకం తెచ్చుకుంటే ఆ మార్పు ఏమిటో అర్థం అవుతుందన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే చిన్నారులు ఇంగ్లిష్ పదం అర్థం తెలుసుకునేలా బొమ్మలతో కూడిన డిక్షనరి అందచేయడం సీఎం ఆలోచన విధానానికి అద్దం పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో పోటీతత్వం పెంచేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల పేరుతో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తూ సన్మానిస్తున్నామని తెలిపారు.

గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదగాలన్నదే సీఎం కోరిక

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అని ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు అన్నారు. గత ప్రభుత్వాలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు మంచి చదువు అందించాలన్న ఆలోచన లేకపోవడంతో విద్యావిధానం భ్రష్టు పట్టిందన్నారు.

ఐదేళ్ల క్రితం పిల్లలకు పలక ఇవ్వడానికి తల్లిదండ్రులకు ఆర్థిక స్తోమత లేక పిల్లలను తమ వెంట పనులకు తీసుకువెళ్లేవారని, ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన రోజునే రూ.2500 విలువైన యూనిఫాం, పుస్తకాలు, బూట్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం నియోజకవర్గం, మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను మంత్రి ఆదిమూలపు సురేష్ శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. వారికి ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం, త్రిపురాంతకం ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జెడ్పీటీసీలు వాగ్యానాయక్, మాకం జాన్‌పాల్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, పెద్దకాపు జి.వెంకటరెడ్డి, డీఎల్‌డీఓ బీవీఎస్.సాయికుమార్, ఎంపీడీఓ వైవీ నాగేశ్వరప్రసాద్, ఎంఈఓలు పి.ఆంజనేయులు, మస్తాన్‌నాయక్, మల్లికార్జుననాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

- రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు



మాట్లాడుతున్న ఎంపీపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి

మర్రిపూడి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజారంజక పాలన అందిస్తున్నారని రాష్ట్ర ఎంపీపీ సంఘం అధ్యక్షుడు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేకల హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పేద,బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారని కొనియాడారు. వెనుకబడిన తరగతుల వారికి ఉన్నత పదవులు కల్పించేందుకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. మరో 30 ఏళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతూ సువర్ణ పాలన అందిస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎవరెన్ని పార్టీలు పెట్టినా, ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్ సీపీని విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. ఎంపీపీ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లా రౌతులపూడి ఎంపీపీ రాజ్యలక్ష్మిపై దాడికి పాల్పడిన గిరిజనేతరులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

నూరుశాతం పాఠ్య పుస్తకాల పంపిణీ

- విద్యాశాఖ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి

కనిగిరి రూరల్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా నూరుశాతం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు విద్యాశాఖ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలను, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను, జేవీకే కిట్ల స్టాక్ పాయింట్లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కచ్చితంగా జగనన్న విద్యా కానుక కిట్లను అందచేయాలన్నారు. ఏ విద్యార్థికైనా కిట్లు అందకపోతే సంబంధిత మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి జేవీకే ఇట్లు ఇచ్చారా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వారికి కావాల్సిన సేల్ టెస్ట్‌బుక్స్‌లు అందుబాటులో ఉంచామన్నారు. శనివారం లోగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలన్నీ కచ్చితంగా అంచేయాలన్నారు. ఎంఈఓ జె.ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయులు రాజాల కొండారెడ్డి, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





మత్స్య సిరి కోసం..

సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసింది. నిరంతరం ఆటుపోట్ల మధ్య సాగే మత్స్యకారులకు ఏటా 61 రోజులు విశ్రాంతి..మత్స్య సంపద వృద్ధి కోసం రెండు నెలలు వేట నిషేధం.. ఈ ఏడాది నిషేధ కాలం పూర్తి కావడంతో గురువారం వేకువజామునే మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజ చేసి వేటకు వెళ్లారు. రెండు నెలల విరామం తరువాత వేటకు వెళుతుండటంతో భారీగా మత్స్య సంపద దొరుకుతుందని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– కొత్తపట్నం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో జంకె, ఆయన తనయుడు

సీఎంను కలిసిన జంకె

మార్కాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఆయన తనయుడు జంకె రామాంజనేయరెడ్డి గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వారితో జిల్లా రాజకీయాలపై చర్చించారు. సీఎంను కలిసిన వారిలో గాయం కోటిరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీ నియామకాలు.. వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 37 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, ప్రిన్సిపాల్, పీఈటీ, పార్ట్‌టైమ్ పీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీసీఎఫ్ఎస్ఎస్.కేజీబీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా ఒంగోలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియజేయాలని స్పష్టం చేశారు.

పెషిమామ్, మౌజన్లకు సువర్ణావకాశం

- దరఖాస్తులు సమర్పించేందుకు వారం గడువు

ఒంగోలు: మసీదుల్లో పనిచేస్తున్న పెషిమామ్, మౌజన్లు గౌరవ వేతనం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.అర్చన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 376 మసీదుల్లో పనిచేస్తున్న పెషిమామ్, మౌజన్ల గౌరవ వేతనం ఆయా మసీదుల బ్యాంకు ఖాతాకు జమచేస్తున్నట్లు తెలిపారు. మరో 120 మసీదుల అధ్యక్ష కార్యదర్శుల నుంచి వచ్చిన వినతులను కూడా స్వీకరించి విజయవాడ వక్ఫ్‌బోర్డుకు పంపామని పేర్కొన్నారు. వారు కాకుండా ఇంకా జిల్లాలో మిగిలిన మసీదులకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు దరఖాస్తులను వారం రోజుల్లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మసీదు పేరిట బ్యాంకు ఖాతా పుస్తకం, ఇమామ్, మౌజన్ ఆధార్‌కార్డులు, మసీదు కమిటీ అధ్యక్షుని ఆధార్ కార్డులను దరఖాస్తులకు జత చేయాలని స్పష్టం చేశారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

కంభం: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను గురువారం సాయంత్రం కందులాపురం అడ్డరోడ్డు సమీపంలో కంభం ఎస్సై నాగమల్లేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కథనం మేరకు.. గతనెల 30న మండలంలోని జంగంగుంట్ల శివాలయంలో గుడిగంటలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై దర్యాప్తు ప్రారంభించారు. పొదిలి పట్టణానికి చెందిన పొదిలి నరసింహారావు అనే వ్యక్తి గురువారం కందులాపురం సెంటర్‌లో ఉండగా అదుపులోకి విచారించారు. కందులాపురంలో డ్రిప్ పైపులు, గిద్దలూరు మండలం ఉయ్యాలవాడలో అంకాలమ్మ ఆలయంలో వెండి కిరీటం, అమ్మవారి బంగారు తాళిబొట్టు, పుల్లలచెరువు మండలంలో చర్చిలో యాంప్లిఫయర్, స్పీకర్లు, హైదరాబాదులో ఒక మోటారు సైకిల్, నరసరావుపేటలో మరో మోటారు సైకిల్ చోరీ చేసినట్లు, మర్రిపూడి, దర్శి పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ మేరకు వాంగ్మూలం నమోదు చేసి, నిందితుడిని గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

వరిగడ్డి లారీ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వరిగడ్డి లారీ

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో వరిగడ్డి లారీ గద్దమైన సంఘటన గురువారం జరుగుమల్లి మండలం కామేపల్లిలో సాయిబాబా గుడి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడ నుంచి పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి లారీలో వరిగడ్డి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో లారీ కామేపల్లి సాయిబాబా గుడి సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలు వరిగడ్డికి తగలటంతో మంటలు చెలరేగాయి. గడ్డితో పాటు లారీకూడా పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అంచనా. కొండపి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

పేదలఅభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు సహించలేకపోతున్నాయి
- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- జి.ఉమ్మడివరంలో గడపగడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు గడపగడపకు వస్తున్నారని, పేదల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టనాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం జి.ఉమ్మడివరంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. 17 రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. పేదలకు అందిస్తున్న ఆర్థిక సహాయానికి ప్రతిపక్షాలు గండికొట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. నవరత్నాలు పథకాల ద్వార ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చేందుకు గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానికంగానే సమస్యలు పరిష్కరించడం సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు నిదర్శనమన్నారు. అందరికీ మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. సమస్యలపై పలువురు అర్జీలివ్వగా తక్షణమే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వహించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. తొలుత గ్రామ ప్రజలు మంత్రి సురేష్‌పై పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ విగ్రహానికి మంత్రి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓ మల్లికార్జుననాయక్, ఏఓ కె.నీరజ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ ఎ.ఆదిరాములు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాలరెడ్డి, మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మల్లికార్జున్, పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, వెంగళరెడ్డి, వెంకటరెడ్డి, రంగబాబు నక్కా చిన్నత్రిపురారెడ్డి, శ్రీను, నాసరయ్య, హనుమంతరావు, యోగయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి సురేష్

సంక్షేమ పథకాలతో ఆర్థిక స్థిరత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

- జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం గోనుగుంట సచివాలయం పరిధిలోని మర్రిపాలెం, గుడిపూడివారిపాలెంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులు, స్థానిక నాయకులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం చినరావిపాడు నుంచి మర్రిపాలెం మీదుగా మువ్వవారిపాలెం వరకు మండల పరిషత్ నిధులు రూ.2.35 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు తన్నీరు నాగ ఇందిర శ్రీనివాసరావు, మాజీ కన్వీనర్ దాసరి లక్ష్మీనారాయణ, సొసైటీ ప్రెసిడెంట్ బొడ్డు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కుంచాల రాంబాబు, పులి శ్రీనివాసరావు, యర్రగుంట్ల వసంతరావు పాల్గొన్నారు.



తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

అనుమానాస్పద స్థితిలో రిక్షా కార్మికుడు మృతి

కనిగిరి రూరల్: స్థానిక కందుకూరు రోడ్డులోని పేరంగుడిపల్లి వద్ద బియ్యం గోడౌన్ సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో చెక్కబల్ల రిక్షా కార్మికుడు పెన్నా తిరుపతయ్య(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పెన్నా తిరుపతయ్య చెక్కబల్లా రిక్షా కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతను సోమవారం నుంచి కనిపించడం లేదు. గురువారం బియ్యం గోడౌన్ వద్ద మృతదేహం ఉన్ను పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన వెళ్లి పరిశీలించారు. మృతుడిని పెన్నా తిరుపతయ్యగా గుర్తించారు. సంఘటనా స్థలంలో మద్యం, నీళ్ల సీసాలతోపాటు, మృతుడి చొక్కా జేబులో నిద్ర మాత్రలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. తీవ్ర దుర్వాసన వస్తుండటంతో చనిపోయి రెండు లేదా మూడు రోజులు అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అప్పుల బాధతోనే ఆత్మహత్య?

తిరుపతయ్య అప్పుల బాధతోనే మృతి చెందినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. డబ్బు చెల్లించాలని అప్పులిచ్చినవాళ్లు ఒత్తిడి చేయడంతో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి మద్యంలో నిద్రమాత్రలు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి కార్మికులు చర్చించుకుంటున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సైలు

దూసుకొచ్చిన మృత్యువు

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ట్రక్ ఆటో
- తప్పించుకునే క్రమంలో ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



సంఘటనా స్థలంలో విజయరావు మృతదేహం



చెట్టును ఢీకొట్టిన ఆటో

కొనకనమిట్ల: వేగంగా వస్తూ అదుపు తప్పిన ట్రక్ ఆటో రోడ్ మార్జిన్‌లో చెట్టును ఢీకొట్టింది. అదే సమయంలో చెట్టు కింద ఉన్న వ్యక్తుల్లో ఒకరు తప్పించుకునే ప్రయత్నంలో అక్కడికక్కడే మృతి చెందారు. 565 జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం పెదారికట్ల వద్ద గురువారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. తర్లుపాడు ఎస్సీ కాలనీకి చెందిన పులుకూరి విజయరావు(55) అతని భార్య గంగమ్మతో కలిసి పెదారికట్లలోని ఓ టెంట్ హౌస్‌లో పనిచేయడానికి వచ్చారు. రహదారి పక్కనే ఉన్న టెంట్ హౌస్ దుకాణం వద్ద ఇద్దరు కూర్చొని ఉండగా అదే సమయంలో పెదారికట్లకు చెందిన పెదఓబులరెడ్డి కూడా వారి వద్దకు వచ్చి మాట్లాడుతున్నారు. అయితే పొదిలి వైపు నుంచి కనిగిరి వైపు వెళ్తున్న ట్రక్ ఆటో అదుపు తప్పి వారి వైపు దూసుకొచ్చి చెట్టును ఢీకొట్టింది. తప్పించుకునేందుకు యత్నించిన విజయరావును ఆటో బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా పెద ఓబుల్‌రెడ్డికి కాలు విరిగింది. ఆటోలో ఉన్న డ్రైవర్ కోటేశ్వరరావు, మరో వ్యక్తి గాయపడ్డారు. కాగా విజయరావు భార్య గంగమ్మ మాత్రం ప్రమాదం నుంచి బయట పడింది. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని కొనకనమిట్ల ఎస్సై దీపిక పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పొట్టకూటి కోసం కూలి పనికి వచ్చి భర్తను పోగొట్టుకున్న గంగమ్మ బోరున విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

- తల్లిదండ్రులు చూసిన సంబంధం కాదని ప్రేమికుడితో వివాహం
- అదే వ్యక్తికి తన సోదరిని ఇచ్చి పెళ్లి చేసిన తల్లిదండ్రులు
- పెళ్లయిన 9 రోజులకే విషాదాంతం

తాళ్లూరు: మొదటి భర్తతో విబేధాలు, మూడేళ్ల క్రితం విడాకులు.. ఆపై మరో వ్యక్తితో వివాహానికి తల్లిదండ్రుల సన్నాహాలు.. అంతలోనే తను పనిచేసే బేకరీ యజమానితో ప్రేమ పెళ్లి.. ఈ క్రమంలో బంధువుల మాటలతో మనస్తాపానికి గురై పెళ్లయిన 9 రోజులకే వివాహిత యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని హరిదాస్ నగర్‌కు చెందిన జక్కుల వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె ప్రియాంక(23)కు వివాహం కాగా భర్తతో విభేదాలు రావడంతో మూడేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. దీంతో తల్లిదండ్రులు దుర్గి మండలం కొలగంట్లకు చెందిన జగదీష్‌తో రెండో వివాహం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 7వ తేదీ వారి పెళ్లి జరగాల్సి ఉండగా ముందు రోజు 6వ తేదీన ఆమె పనిచేస్తున్న బేకరి యజమాని రాజా గౌడ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో ప్రియాంక తల్లిదండ్రులు జగదీష్‌కు తమ మూడో కుమార్తెనిచ్చి అదే ముహూర్తానికి వివాహం చేశారు. తన సోదరి పెళ్లి కార్యక్రమాల్లో కూడా ప్రియాంక ఉత్సాహంగా పాల్గొంది. పెళ్లిలో బంధువులంతా మంచి స్తోమత, పరపతి కలిగిన సంబంధం పాడుచేసుకున్నావంటూ ప్రియాంక చేసిన పొరపాటును పట్టిచూపారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా మనస్తాపానికి గురైన ఆమె మానసికంగా కుంగిపోయింది. గురువారం ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయిన 9 రోజులకే తనువు చాలించడం తల్లిదండ్రులు, బంధుమిత్రులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

వీరభద్రాపురంలో నీటి కొరత లేదు

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ

యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురంలో తాగునీటి కొరత లేదని, అనునిత్యం పైపులైన్ ద్వారా పుష్కలంగా నీరు సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ తెలిపారు. గురువారం రెండు పచ్చపత్రికల్లో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. బుధవారం వీరభద్రాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు స్వాగతం పలుకుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో కొంతమంది టీడీపీకి చెందిన వ్యక్తులు అక్కడికి చేరి తాగు నీరు ఇవ్వలేని మంత్రికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఒక ఫ్లెక్సీని కొంతమేరకు చించేశారు. దీనిని ఆసరాగా తీసుకొని ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో కథనం ప్రచురించారు. టీడీపీకి చెందిన కొంతమంది కావాలని ఫ్లెక్సీల రగడ చేశారని ఆ ప్రాంత ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు తెలిపారు. పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా పంపింగ్ హౌస్ ఉందని, 90 వేల లీటర్ల సామర్థ్యం గల సంప్ వెల్ ఉందని, దాని ద్వారా వీరభద్రాపురంతో పాటు గడ్డమీదిపల్లె, కొలుకుల గ్రామాలకు అనునిత్యం సాగర్ నీరు సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. అక్కడికి సమీపంలో నివాస గృహాలు ఉన్న ప్రాంతాల్లో రెండు ట్యాప్‌ల నుంచి 24 గంటలు నీరు వస్తుందని, మరొక డీప్ వెల్ బోరు పనిచేస్తుందని, రెండు రోజుల క్రితం పాఠశాలకు సమీపంలో రూ.2.50 లక్షల జిల్లా పరిషత్ గ్రాంట్‌తో డీప్‌వెల్ బోరు వేసినట్లు తెలిపారు. ఇన్ని పథకాలు ఆ గ్రామంలో ఉంటే నీటి కొరత ఏ విధంగా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. కావాలనే కొంతమంది నీటి సమస్యను లేవనెత్తుతున్నారని మండిపడ్డారు. ఇది ఇలా ఉండగా మంత్రి ఆదిమూలపు సురేష్ రాత్రి 9.30 గంటల వరకు గడప గడపకు మన కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 70 గడపలు తిరిగి గత 4 సంవత్సరాలుగా ప్రభుత్వ పరంగా లబ్ధి పొందిన వివరాలను వారికి వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. రోడ్డు ఏర్పాటు చేయాలని, పింఛన్ మంజూరు చేయాలని పలువురు మంత్రిని కోరారే తప్ప నీటి సమస్య ఉందని ఎవరూ చెప్పలేదు. అవాస్తవాలను ప్రచారం చేయడంలో పచ్చ నేతలు, కార్యకర్తలు ముందుంటారని పలువురు ఆ గ్రామస్తులు ఆరోపించారు.

ప్రాణాలు తీసిన అతివేగం!

- గుండ్లాపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- విజయవాడకు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం



ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు

మద్దిపాడు: స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో విజయవాడ వెళ్తున్న ఇద్దరు స్నేహితులు మార్గమధ్యంలో ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద ఘటన గురువారం తెల్లవారుజామున మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. విజయవాడకు చెందిన మల్లువలస శివతేజ(22), అతని స్నేహితుడు గోవాడ రవితేజ(22) ఇద్దరూ కలిసి బైక్‌పై బుధవారం రాత్రి విజయవాడ నుంచి ఒంగోలు వచ్చారు. ఒంగోలులో స్నేహితుడి బర్త్‌డే వేడుకల్లో పాల్గొని గురువారం తెల్లవారుజామునే తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 6 గంటల సమయంలో గుండ్లాపల్లి సమీపంలోని మహి ఆగ్రో ఫ్యాక్టరీ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. బయటకు వెళ్లి ఇప్పుడే వస్తానని చెప్పిన కుమారుడు శవంగా ఇంటికి వచ్చాడని శివతేజ తండ్రి పాపారావు బోరున విలపించారు. మోటర్ బైక్‌ను అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.